మిలటరీ కాలనీ స్థలాలు.. దురాక్రమణ..!

- అరకోటి విలువైన స్థలాలు కబ్జా?
- ఇళ్ల నిర్మాణానికి పూనుకున్న ఆక్రమణ దారులు
- మిలటరీ కాలనీలో మిలటరీ వారికే స్థలాలు కరువు
- ఆవేదనలో సైనిక కుటుంబాలు



ఆక్రమణలు జరుగుతున్న మిలటరీ కాలనీలోని స్థలాలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో కబ్జాల పర్వం కొనసాగుతోంది. చెరువులు, ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ తంతులో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. దీనికి బొబ్బిలిలోని మిలటరీ కాలనీలో సాగుతున్న దురాక్రమణలే నిలువెత్తు నిదర్శనం. వివరాల్లోకి వెళ్తే..

బొబ్బిలి పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో రాజావారి కోనేరుకు ఆనుకుని మల్లంపేట రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 237/3లో కొంతమంది మాజీ సైనికులకు గతంలో ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. ఈ ప్రాంతానికి మిలటరీకాలనీ,(బోసు నగర్)గా నామకరణం చేశారు. 2000–21 సంవత్సరంలో దాదాపు 60 మందికి ఇక్కడ ఇళ్ల స్థలాలను కేటాయించారు. వారిలో కొంతమంది ఇళ్లను నిర్మించుకోగా మరి కొందరు ఆర్థిక వెసులుబాటు లేక విక్రయించి వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారు. ఇక్కడ కమ్యూనిటీ బిల్డింగ్, చిల్డ్రన్ పార్కు తదితర మౌలిక సదుపాయాల కల్పనకోసం కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలాల్లో పార్కు స్థలాన్ని అక్రమార్కులు పూర్తిగా ఆక్రమించేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఇప్పుడు కొంతమంది అక్రమమార్గంలో సక్రమమైన ఇళ్ల నిర్మాణాలను మొదలెట్టారు. దీనిపై ఇప్పటికే కాలనీ సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘంలోని కొంతమంది పెద్దలు ఈ ఆక్రమణల తతంగాన్ని నడుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణ పర్వాన్ని కాలనీకి చెందిన మాజీ సైనికుడు శ్రవణం గోవిందరావు సతీమణి వెంటలక్ష్మి, ఎ.గోవిందనాయుడు, ఎం.రామినాయుడు, ఎం.ధర్మారావు తదితరులు స్థానిక విలేకరులకు వివరించారు. అర్హతలున్నవారికి స్థలాలు ఇవ్వకుండా వేరే ప్రాంతంలో ఉన్నవారికి డబ్బులు తీసుకుని అక్రమంగా స్థలాలు కట్టబెడుతున్నారంటూ ఆరోపించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని, ఆక్రమణలు తొలగించి ఇళ్ల స్థలాలను అర్హులకు కేటాయించాలని కోరారు.

అర్హత ఉన్నా స్థలం ఇవ్వలేదు



భారత సైన్యంలో సైనికునిగా పనిచేసి భర్త రిటైర య్యారు. మిలటరీ కాలనీలో స్థలం కేటాయించాలని కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి ఇక్కడ ఇళ్ల స్థలాన్ని కేటాయిస్తున్నారు. కమ్యూనిటీ బిల్డింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించి ఇళ్లు కట్టుకుంటున్నారు.

– శ్రవణం వెంకటలక్ష్మి, గోవిందరావు సతీమణి, మిలటరీ కాలనీ

అధికారులకు చెబుతున్నా..



ఆక్రమణలు జరుగుతున్నాయని అధికారులకు చెబుతూనే ఉన్నాం. కబ్జాకు సిద్ధమవుతున్న స్థలాలు ఎవరికి చెందినవో తెలియడం లేదు. వెదురు కర్రలు పాతుకుని స్థలాలను ఎంపిక చేసుకుంటున్నారు. అర్హులైన మాజీ సైనికులమైన మాకు అన్యాయం జరుగుతోంది. సంక్షేమ సంఘం ముసుగులో కొంతమంది తెరవెనుక నుంచి ఆక్రమణల తతంగం నడిపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.రామినాయుడు, మాజీ సైనికుడు, దిబ్బగుడ్డివలస

చర్యలు తీసుకుంటాం



ఆక్రమణల అంశం నా దృష్టికి వచ్చింది. సిబ్బందితో కలిసి కాలనీని పరిశీలిస్తాం. ఆక్రమణలు తొలగిస్తాం. ఆక్రమణలకు సహకరిస్తున్న సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటాం.

– మల్లెపురెడ్డి శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు



మాట్లాడుతున్న ఏఈ ప్రణయ

బొబ్బిలి: నియోజకవర్గంలోని తెర్లాం, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి మండలాల్లోని మొత్తం 9 రోడ్ల మరమ్మతులకు రూ.1.46 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఏఈ బి.ప్రణయ తెలిపారు. ఇదే విషయమై ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి, అక్కడి నుంచి బలిజిపేట మండలంలోని బర్లి రహదారులకు రూ.8.1 లక్షలు, డొంకినవలస రైల్వేస్టేషన్ రహదారికి రూ.15 లక్షలు, సుందరాడ రహదారికి రూ.3.50 లక్షలు, బొబ్బిలి మండలంలోని నాలుగు రహదారులకు రూ.8 లక్షలు, తెర్లాం మండలంలోని 3 రహదారులకు రూ.5 లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు. అలాగే రామభద్రపురం బైపాస్ రహదారికి రూ.14 లక్షలు, కోటశిర్లాం రహదారికి రూ.46 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులను సోమవారం ప్రారంభించినట్లు చెప్పారు. ఉత్తరావెల్లి నుంచి రామభద్రపురం, బొబ్బిలి నుంచి తెర్లాం వెళ్లే రహదారుల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు పంపించామన్నారు.

వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని గాయత్రీకాలనీకి చెందిన డి.ఉమామహేశ్వరరావు మోటార్ సైకిల్‌పై నుంచి జారిపడిన ఘటనలో తీవ్ర గాయాలపాలయ్యాడు. సోమవారం సాయంత్రం బొద్దాం నుంచి రాజాం వస్తుండగా, పెనుబాక దాటిన వెంటనే ఆయనకు ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి మోటార్‌సైకిల్ మీద నుంచి జారిపడినట్లు స్థానికులు తెలిపారు. అక్కడే ఉన్న కొంతమంది 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, రాజాం 108 సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని, వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రుడిని రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటపాటల్లోనూ రాణించాలి

రాజాం: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని గాయని జానకీలహరి సూచించారు. ఈ నెల 14వ తేదీన బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణ పరిధిలోని మెంతిపేటలో ఉన్న ప్రభుత్వ బాలభవన్‌లో సోమవారం నిర్వహించిన సంగీత పోటీలను ఆమె ప్రారంభించి, న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సంగీతంపై కూడా దృష్టిసారించాలన్నారు. సంగీతం మానసిక ఉల్లాసానికి, ఉపాధికి ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీలకు రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి 300 మంది విద్యార్థులు హాజరు కాగా, పోటీలను బాలభవన్ సంగీత ఉపాధ్యాయిని విజయలక్ష్మితో కలిసి పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతగా వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు ఈ నెల 14న బాలభవన్‌లో జరిగే బాలల దినోత్సవంలో బహుమతులు అందిస్తామని బాలభవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు.

హరహర మహాదేవ..

భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తీకమాసం రెండో సోమవారం సైతం ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తజనంతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచే దైవ దర్శనాలకు మందిరాల వద్దకు బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని, మనసారా దేవుడిని దర్శించుకున్నారు. దీపాలు వెలిగించి శివకేశవులను ఆరాధించారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. హరహర మహాదేవ.. శంభో శంకర.. శంభో శివ శంభో అని భక్తులు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.

–బొబ్బిలి, రాజాం



రేగిడి: సంకిలి శివాలయంలో భక్తుల సందడి



తెర్లాం: కూనాయవలస శివాలయానికి పోటెత్తిన భక్తులు



వంగర: దైవదర్శనానికి సంగాం ఆలయం వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



బాడంగి: భక్తులతో కిక్కిరిసిన పాల్తేరులోని పార్వతీమల్లిఖార్జున ఆలయం



రామభద్రపురంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: మొగిలివలస కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తుల పూజలు



రాజాంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



బొబ్బిలిరూరల్: మహిళల దీపారాధన

క్లుప్తంగా

పరామర్శ



రాముడమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జామా ఈశ్వరరావును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం కలిసి పరామర్శించారు. ఇటీవల ఈశ్వరరావు భార్య రాముడమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన.. ఆ గ్రామానికి సోమవారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రాముడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాకరాపల్లి సర్పంచ్ వావిలపల్లి రమణారావు, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో రూ.2 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ డ్రెయిన్ కమ్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రధాన వీధికి అనుసంధానిస్తూ ఈ పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రేగిడి: భగవాన్ సత్యసాయి 99వ జయంతి పురస్కరించుకుని, రేగిడి గ్రామంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు సోమవారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు. ప్రథమ, తృతీయ స్థానాల్లో సంకిలి జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నారు. సత్యసాయి జయంతి రోజున విజేతలకు బహుమతులు అందించనున్నామని నిర్వాహకులు మామిడి శివప్రసాద్ తెలిపారు.


అక్షరాస్యత మెరుగుపరిచేందుకు కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: అక్షరాస్యత శాతం మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన.. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన చేపట్టనున్న ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) శిక్షణను సక్రమంగా నిర్వహించాలని, శతశాతం అక్షరాస్యత నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సీసీఎస్, వీవోఏలు, వీటీలకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి, ఎంఈవోలు లక్ష్మణరావుదొర, రాజేశ్వరి, ఏపీఎం రత్నకుమార్, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దృష్టిలోపం నివారణపై అవగాహన



దృష్టిలోపం నివారణపై అవగాహన కల్పిస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు

రాజాం సిటీ: స్థానిక యూపీహెచ్‌సీలో నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల ఆరోగ్య సిబ్బందికి దృష్టిలోపం నివారణ చర్యలపై సోమవారం అవగాహన కల్పించారు. ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లోని ఆరోగ్య సిబ్బంది అంతా దృష్టిలోపం నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడంపై పలు సూచనలు చేశారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ చిన్నారుల్లో వివిధ దశల్లో ఉండే దృష్టి సమస్యలు, వాటి లక్షణాలను తెలిపారు.

మద్యంషాపు తరలించాలని డిమాండ్



బొబ్బిలి పట్టణంలోని మేదరిబందకు దగ్గరలో ఏర్పాటు చేసిన మద్యంషాపును తరలించాలని అక్కడి మహిళలు డిమాండ్ చేస్తున్నారు. వైన్‌షాపులు మొదట ప్రారంభించిన సమయంలో ఇదే వీధిలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన దుకాణాన్ని తరలించాలని మహిళలంతా కొన్ని రోజుల పాటు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఇదే విషయమై ఎమ్మెల్యే బేబీనాయన వద్దకు కూడా మహిళలు వెళ్లగా, గొల్లవీధికి షాపు మార్చుకోవాలని షాపు యజమానులకు ఎమ్మెల్యే సూచించారు. అయినా పాత షాపు పక్కనే మహిళలు కుళాయి నీరు పట్టుకునే చోటుకు ఆ షాపును మార్చారు. దీనిపై మండిపడిన అక్కడి మహిళలు షాపును వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ సోమవారం మరోసారి ఆందోళనకు దిగారు. దుకాణం మార్చమంటే పక్కకు మార్చడమేనా అని మండిపడ్డారు.

–బొబ్బిలి

ఆక్రమణలు అడ్డుకోండి



బొబ్బిలి మండలం, రామన్నదొరవలస గిరిజన గ్రామంలో జరుగుతున్న భూ ఆక్రమణలు అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామ పరిధిలోని 90 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకుని, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన భూములను బలవంతంగా లాక్కుని రికార్డులు తారుమారు చేసి మరీ రామభద్రపురానికి చెందిన ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నాడని విచారణ జరిపి, న్యాయం చేయాలని అభ్యర్థించారు. అనంతరం తహసీల్దారు ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.

–బొబ్బిలి రూరల్

'చలో విజయవాడ'కు తరలిరండి



వీఆర్ఏలంతా తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలో తహసీల్దారు దిరిశాల ధర్మరాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం అమలు, పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాల పెంపు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నామన్నారు. కార్యక్రమానికి వీఆర్ఏలంతా పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

–వంగర

వాహన ధ్రువపత్రాలు తప్పనిసరి



వాహనదారులకు సూచనలిస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వాహనదారుల వద్ద ఉండాలని సీఐ కె.నారాయణరావు సూచించారు. మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్ఐ వి.ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి ట్రిపుల్ రైడ్ చేసిన వారి వాహనాలతో పాటు ఎటువంటి వాహన ధ్రువపత్రాలు లేని వారి వాహనాలను స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఆయా వాహన చోదకులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు చర్యలు



వంగర: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రినాథ్



బొబ్బిలి రూరల్: సర్వేపై ఆరాతీస్తున్న ఎంపీడీవో రవికుమార్

వంగర: గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్ సూచించారు. ఇదే విషయమై మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఇంట్లో నివశిస్తున్న వారి సంఖ్య, మరుగుదొడ్లు ఉన్న ఇళ్ల సంఖ్య, మరుగుదొడ్లు లేని ఇళ్ల సంఖ్య వంటి పలు వివరాలతో కూడిన నివేదికను మూడు రోజుల్లోగా కార్యాలయానికి అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు, మహిళా పోలీసు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో మరుగుదొడ్లు ఉన్న ఇళ్లు, మరుగుదొడ్లు లేని వారి ఇళ్ల సర్వేకు సంబంధించి, మండలంలోని కారాడ, పిరిడి, గొర్లెసీతారాంపురం తదితర గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటా సర్వేను ఎంపీడీవో పి.రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఆరుబయట మల, మూత్ర విసర్జన చేయరాదని, ప్రతిఒక్కరూ ఇంటి వద్ద మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అలా అయితేనే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని ప్రజలకు తెలిపారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలి

బాడంగి: ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దారు కె.సుధాకర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్య కొనుగోలుపై సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. తేమ, వ్యర్థాల శాతం, గ్రేడింగ్ వంటివి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మొదటి రకం ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2,320 కాగా, సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2,300గా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఏవో శిరీష మాట్లాడుతూ ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకున్న రైతుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రవాణా, హమాలీల చార్జీలు రైతులు చెల్లిస్తే ధాన్యం బిల్లులతో పాటు ఆయా చార్జీలు కూడా చెల్లిస్తామన్నారు. పాడీ ప్రొక్యూర్‌మెంట్ యాప్‌లో వివరాలు ఏ విధంగా నమోదు చేయాలన్న దానిపై టీసీఎస్ కంపెనీ టెక్నిషియన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ స్వర్ణలత, ఏఈవో పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఏవో జి.సునీల్‌కుమార్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ధాన్యం సేకరణపై సివిల్ సప్లయి సాంకేతిక సహాయకులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ స్వర్ణలత, టీసీఎస్ టెక్నిషియన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు జీపీడీపీపై శిక్షణ

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీ)పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీవోఏలకు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల తయారీ, వాటి అమలు చర్యలను నేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలోని 18 శాఖల సిబ్బంది హాజరుకావాలని కోరారు.

60 ద్విచక్ర వాహనాల సీజ్

బొబ్బిలి: మండలంలో ఆది, సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 60 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సోమవారం ఆయా వాహనదారులను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో ప్రయాణించాలన్నారు.

గర్భిణులకు నారాయణ సేవ

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి సోమవారం వచ్చిన గర్భిణులకు సత్యసాయి భక్తులు నారాయణ సేవ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సీహెచ్ అసిరినాయుడు పాల్గొన్నారు.